ALLARI



## చెప్పుకోండి

- నన్ను నిప్పు కాల్చలేదు. నీరు తడపలేదు. నేను సూర్యుడితోనే వస్తాను. సూర్యుడితోనే పోతాను?
  **- నీడ**
- నీటి మీద తేలుతాను కానీ, పడవను కాదు. చెప్పకుండా పోతాను కానీ, జీవిని కాదు. మెరుస్తాను కానీ మెరుపును కాదు?
  **- నీటి బుడగ**



## మంచిమాట



**గుణానికి మనకంటే ఎక్కువ ఉన్న వారితోనూ, ధనానికి మనకంటే తక్కువ ఉన్నవారితోనూ పోల్చుకోవాలి!**

## రంగులేయండి



**చుక్కల ఆధారంగా బొమ్మ గీసి, రంగులు వేయండి.**



## తెలుగు కథ

# కుండెడు తెలివి

... పత్తిపాక మోహన్

ఒకసారి బీరుబల్ మీద అకుబర్ పాదుషాకు కోపమచ్చింది. అచ్చిందెన్కనే.. ''నువ్వు నా కండ్లకు కనవడకుంట వో!'' అంట హుకుం జారీ జేశిండు. 'సరే అయితెమాయె! నాకు ఇల్వ లేనికాడ నేనెందుకు ఉండాలె' అనుకొని, తట్టబుట్ట – ముల్లె మూట సదురుకొని, దూరంగున్న ఒక పల్లెటూరుకు మకాం మార్శిండు బీరుబల్. ఆడ ఎవ్వలు కూనం బట్టకుంట ఏషం, పేరు.. రొండు మార్సుకుని ఎవుసం జేయవట్టిండు. కొన్ని దినాలు గాంగనే బీరుబల్ లేకుంటె ఎట్లుంటదో తెలిసి.. అకుబర్ పాదుషా పొద్దువోక తాయిమాయి అయిండు. దర్బారుల ఆళ్లకూ–ఈళ్లకూ బీరుబల్ యాడున్నడో దొరుకవట్టుమంట జెప్పిండు. ఆళ్లు రాజ్యం అన్ని మూలల్ల తిరిగచ్చిండ్లు. ఎవలకు బీరుబల్ జాడ దెలువలే గదా.. ఏగులకు గూడ దొరుకలే! బీరుబల్‌ను ఎట్ల వట్టుకోవాల్నో అకుబర్‌కు ఎరికే! ఎంటనే దండోరా ఏశెటోళ్లను విలిశి.. ఆళ్లకు ఒక ఖాళీ కుండ ఇచ్చి.. ''ఈ కుండనిండ తెలివి నింపి తెచ్చినోళ్లకు ఇనామిత్త!'' అంట దండోరా ఏయించిండు. బీరుబల్ ఉన్న ఊర్లెగూడ గిట్లనే దండోరా ఏశిండ్లు. గది ఇన్న బీరుబల్ ఎంటనే కర్బూజ ఇత్తునాలు దెచ్చి అలికిండు. ఏనుకొని పిందెలు ఏయంగనే.. ఒక పిందెను మెల్లంగ ఖాళీ కుండల వెట్టిండు. కొన్ని దినాలు కాంగనే.. కర్బూజ కాయ కుండ నిండుగ వెరిగింది. ఆ కాయను తీగకెల్లి దెంపి, దర్బారుకు వంపిండు. 'కుండలకెల్లి కాయను అవుతల్కి దీస్తే.. కుండ నిండ నింపిన తెలివి గనవడ్తది' అంట శిట్టి గూడ రాశి అంటేశిండు. అది సదివిన అకుబర్.. ''ఇది వంపింది బీరుబలే!'' అంట మంత్రులకు జెప్పి, ఆళ్లను గా ఊరికి వంపిండు. బీరుబల్‌ను విలిపిచ్చిండు. అటెన్క ఎప్పటోలెనే ఇద్దరూ కలిశిమెలిశి ఉన్నరుల్లా!



## అమర్చండి



M T A E

□□□□

**బొమ్మ ఆధారంగా అక్షరాలను సరైన క్రమంలో అమర్చండి.**

## పద్యం - భావం

**ఎప్పుడు తప్పులు వెదకెడు**
**నప్పురుషుని గొల్వగూడదది యెట్లన్నన్**
**సర్పంబు పడగనీడను**
**గప్ప వసించిన విధంబు గదరా సుమతీ!**

**భావం :** తనను సేవించే వ్యక్తిలో ఎప్పుడు ఏ తప్పు దొరుకుతుందా అని నిరంతరం వెతికే స్వభావం ఉన్న వ్యక్తి దగ్గర ఎప్పటికీ పనిచేయకూడదు. అలాంటి వారికి సేవచేయడమంటే.. పాము పడగనీడలో కప్ప నివసించడం లాంటిదే!

## మీకు తెలుసా?



**డబ్బును** ఒక్కో దేశంలో ఒక్కో పేరుతో పిలుస్తారు. అమెరికలో 'డాలర్' అంటే, బ్రిటన్‌లో 'పౌండ్' అని పేరు పెట్టుకున్నారు. మనదేశంలో 'రూపాయి' అంటారు. ఒక్క భారతదేశంలోనే కాదు.. పాకిస్థాన్, నేపాల్, శ్రీలంక, సీషెల్స్, ఇండోనేషియా, మారిషస్, మాల్దీవుల కరెన్సీని కూడా 'రూపాయి' అనే పిలుస్తారు. అయితే వీటి విలువలో తేడా ఉంటుంది.